క్లుప్తంగా

స్వయంపాలన దినోత్సవం



నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని ద్వారక పేట రోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓగా నవ్యశ్రీ, ఎంఈఓగా అనూష, ప్రధానోపాధ్యాయులుగా సంతోష్, పీఈటీగా శివమణి వ్యవహరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని కొంకపాక, గోపనపల్లి, చౌటపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతగరతి విద్యార్థులకు బుధవారం జయహో ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ క్యాక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అక్కినపల్లి సతీష్‌కుమార్, ఫౌండేషన్ సభ్యుడు భూక్యా రాములు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండె రామస్వామి ఇటీవల మృతిచెందారు. బుధవారం రామస్వామి దశదినకర్మలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం రామస్వామి కుమారుడు బాబును పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. బీజేపీ నాయకులు పెదగాని సోమయ్య, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, రంగు రాములు దశదినకర్మలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, సురేందర్‌రావు, జక్కుల వెంకట్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పూస మధు, కర్ర రవీందర్‌రెడ్డి, కొమ్ము రాజు, పులి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పడి ఆవు మృతి



నల్లబెల్లి : మండలంలోని అర్షనపల్లికి చెందిన రైతు బూజగుండ్ల చిన్ననర్సయ్య తన ఆవులను మేతకోసం బుధవారం గ్రామ ఊరచెరువు వద్దకు తోలుక వెళ్లాడు. ఈ క్రమంలో చెరువు మత్తడి వద్ద నీరు తాగుతున్న ఆవు మేడలోని తాడు కాళ్లకు చుట్టుకోవడంతో ప్రమాదవశాత్తు కాల్వలో పడి ఊపిరాడక మృతి చెందింది. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు మృతి చెందిన ఆవు వద్దకు చేరుకుని బోరున విలపించారు.

విద్యార్థులకు అవగాహన

వరంగల్ (పర్వతగిరి) : విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా పరీక్షలు రాయాలని మండల నోడల్ అధికారి లింగారెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన పదోతరగతి విద్యార్థులకు ప్రశ్నాపత్రాల మార్పుపై అవగాహన సమావేశాల ముగింపును బుధవారం ఆయన పరిశీలించారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు గుండెపోటు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ నల్ల స్వామిరెడ్డి విధుల్లో భాగంగా బుధవారం నర్సంపేట డిపోకు వెళ్లారు. వరంగల్ బస్సు నడుపుతున్న స్వామిరెడ్డికి బస్సు వరంగల్ బస్‌స్టేషన్‌కు చేరుకునే సరికి గుండెలో నొప్పి ప్రారంభమైంది అలాగే హనుమకొండ బస్‌స్టేషన్ వరకు చేరుకున్నారు. గుండె నొప్పి ఎక్కువ కావడంతో కండక్టర్ వీఎస్‌నాయక్, ఇతర డ్రైవర్లతో కలిసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పినట్లయిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం స్వామిరెడ్డి ఓ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

వరంగల్(పర్వతగిరి) : మండలంలోని బూర్గుమళ్ల గ్రామానికి చెందిన దూదిమెట్ల శివ(21), రాకేష్ కలిసి ద్విచక్ర వాహనంపై ఈనెల7న అన్నారం ఉర్సు ఉత్సవాలకు వచ్చారు. తిరుగు ప్రయాణంలో వెళ్తుండగా అన్నారం గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టు, స్తంభానికి ఢీ కొట్టారు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో వరంగల్‌కు తరలించారు. శివ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం శివ మృతి చెందాడు. రాకేష్ తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

తూము శిథిలం.. సాగు దుర్భరం

- ఎండుతున్న వరి పంటలు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



ఎల్లార్‌రంగంపేట చెరువు వద్ద శిథిలమైన తూమును చూపుతున్న రైతులు

సంగెం : చెరువు నిండా నీరు ఉన్నా.. పంటలకు సాగుకు కరువైంది.. అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల పట్టించుకోకపోవడంతో అన్నదాతకు ఇబ్బంది తప్పడంలేదు.. తమ గోడు పట్టించుకునే వారు లేక రైతులు కన్నీరు పెడుతున్నారు. మండలంలోని ఎల్లార్‌రంగంపేట చెరువు నిండుగా నీరు ఉంది. ఈ నీటితో చెరువు కింద యాసంగి వరి పంటకు సరిపడడంతో పాటుగా వచ్చే వానాకాలం సీజన్‌కు సరిపోను నీరు ఉంటుంది. దీనికి తోడు ఎస్సారెస్పీ కెనాల్ నీరు సైతం చెరువులోకి వచ్చే వీలుంది. చెరువుకు బుర్రతూము, నక్క తూము, మిట్ట తూము, జాలు తూము నాలుగు తూములున్నాయి. ఇందులో జాలు తూము షట్టర్ గతేడాది శిథిలమైంది. ఎక్కువ నీరు బయటకు వెళ్తుండడంతో తాత్కాలికంగా నీరు బయటకు పోకుండా చేశారు. సుమారు 7 కిలో మీటర్ల దూరం వరకు విస్తరించిన జాలు తూము కిందనే వందల ఎకరాలు సాగవుతోంది. షట్టర్ శిథిలమైపోయి విరగడంతో తూము నుంచి నీరు తక్కువగా వస్తోంది. 2018లో మిషన్ కాకతీయ పథకంలో చెరువు పూడికతీత, కాల్వ ఆధునీకరణ, మత్తడి, తూముల మరమ్మతుల కోసం రూ.3.27 కోట్లు మంజూరు కాగా నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని రైతులు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోని తూమును సరిచేసి సాగునీరు అందించాలని రైతులు బత్తుల ఉప్పలస్వామి, ఎర్రబాక కుమారస్వామి, బానోత్ వీరన్న, ఒర్సు ఎల్లయ్య, వీరస్వామి, కమలమ్మ, ఇమ్మడి బాలకృష్ణ, ఓదెల అశోక్, శాబోతు నగేష్, ఇమ్మడి సమ్మయ్య, మైసయ్య వేడుకుంటున్నారు.

తూము సమస్య పరిష్కరిస్తాం..

ఎల్లార్‌రంగంపేట చెరువు జాలు తూము షట్టర్ మరమ్మతు చేయాలి. దీంతో నీరు వచ్చేందుకు ఇటీవల షట్టర్‌ను తొలగించేందుకు బోర్ వేయించాం. అపుడు నీరు వచ్చింది. మళ్లీ నీరు తగ్గింది. 15ఫీట్ల నీరు ఉండడంతో తూము దగ్గర పనిచేయడానికి ఇబ్బందిగా ఉంది. అధికారులతో మాట్లాడి షట్టర్ సమస్యను పరిష్కరిస్తాం.

- హమీద్, ఐబీ ఏఈ

రైతులను ఆదుకోవాలి



జాలు తూము షట్టర్ విరిగిపోయి ఆన్ ఆఫ్ రాడ్ నుంచి విడిపోయింది. తూము తెరవడానికి ఇబ్బందిగా ఉంది. నీరు తక్కువగా రావడంతో కాల్వ చివరి వరకు నీరు వెళ్లక పంటలు ఎండిపోతున్నాయి. అధికారులు స్పందించి తూము షట్టర్‌ను ఏవిధంగానైనా మరమ్మతు చేసి రైతులను ఆదుకోవాలి.

- దేవేందర్‌రెడ్డి, ఎల్లార్‌రంగంపేట

నీరు రాకపోతే చావే శరణ్యం



నాకు ఉపాధి అవకాశాలు లేక రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకున్న, అప్పులు చేసి నాటు వేసిన. ఇప్పుడు తూము నుంచి నీరు రాక పొలం ఎండుతోంది. రాత్రి పూట కాపలా ఉన్నా నీరు సరిపోవడం లేదు. ఇప్పటికే రూ .40 వేలు పెట్టుబడి పెట్టాను. పంట పండకపోతే చావే శరణ్యం. అధికారులకు దండం మా గోడు పట్టించుకోవాలి.

-బానోత్ వీరన్న, కౌలు రైతు

సంచార పశువైద్యశాల తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

వర్ధన్నపేట : సంచార పశువైద్యశాల–1962 వాహనాన్ని వర్ధన్నపేట పట్టణంలో జీవీకే–ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సంస్థ ప్రాజెక్టు హెడ్ డాక్టర్ భగీష్ మిశ్రా, వరంగల్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ వి.రాము బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని రిజిస్టర్లు, అందుబాటులో ఉన్న పరికరాలు, మందులు వివరాలు తనిఖీ చేసి పరిశీలించారు. అదే విధంగా వైద్యసిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందించారు. సంచార పశువైద్య వాహన సేవలను విస్తృతంగా అందించాలని సిబ్బందిని అప్రమత్తం చేశారు. సమాచారం అందిన వెంటనే సకాలంలో పశువులకు వైద్యం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంచార పశువైద్య సహాయం–1962 పారావేట్ కుమార్, హెల్పర్ భూక్యా వీరన్న, కెప్టెన్ నవీన్ తదితరులు ఉన్నారు.

వలస కూలీలతో వరి నాట్లు



కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం : ధాన్యాగార కేంద్రం పాకాల ఆయకట్టు.. పాకాల ఆయకట్టు కింద వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో కూలీల కొరత ఏర్పడుతోంది. కాగా రైతులు వలస కూలీలను తీసుకువచ్చి నాట్లు వేయిస్తున్నారు. బుధవారం అశోక్‌నగర్ శివారులో ధరావత్ రవివర్మ అనే రైతు తన 10ఎకరాల పొలంలో పశ్చిమ బెంగాల్ నుంచి వలస వచ్చిన కూలీలతో నాట్లు వేయించాడు. అటు వైపుగా వెళ్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తన వాహనాన్ని నిలిపి వలస కూలీలతో ముచ్చటించారు. తెలంగాణలోప్రాజెక్టులు కట్టడంతోనే ఇతర రాష్ట్రాల నుంచి వలస కూలీలు వస్తున్నారని తెలిపారు.

ఎమ్మెల్యేకు పోడు మహిళల కృతజ్ఞతలు

నర్సంపేట రూరల్ : నల్లబెల్లి మండలంలోని మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన రైతులు పోడు భూమి సాగుచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం వారికి అటవీ హక్కు పత్రాలు ఇచ్చిందని, వాటి ద్వారా బ్యాంక్ నుంచి లోన్ రావడం లేదని ఇబ్బందులు పడుతున్నారని నర్సంపేట ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారు. దీంతో పోడు హక్కు పత్రాలపై అసెంబ్లీలో చర్చించిన ఎమ్మెల్యేకు పూలబొకే అందించి కృతజ్ఞతలు తెలిపినట్లు పోడు మహిళలు తెలిపారు. కార్యక్రమంలో మూడు చెక్కలపల్లి సర్పంచ్ బానోత్ పూల్‌సింగ్, కార్మిక సంఘం జిల్లా నాయకులు పాలడుగుల రమేష్, మహిళ రైతులు బానోత్ జాంకీ, బానోత్ రంగమ్మ, గుగులోత్ కొమ్మాలి, భూక్యా కాంతమ్మ, బానోత్ బుల్లి, అజ్మీరా సోమ్లి, జాటోత్ బుజ్జి, మూడు కవిత, వెంకన్న, కోమిలి ఉన్నారు.

‘ధరణి’ పేరుతో భూముల ఆక్రమణ

మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



జోడో యాత్ర నిర్వహిస్తున్న దొంతి మాధవరెడ్డి

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీ హయాంలో పోడు, బీడు, బంజరు భూములకు పట్టాలు ఇస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో అసైన్ చేసి ఆక్రమించుకుంటుందని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మండల కేంద్రంలో బుధవారం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మంగళవారిపేటతో పాటు పలు గ్రామాల్లో యాత్ర నిర్వహిస్తూ మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ చిరంజీవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలగందుల రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట పట్టణంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర ఈనెల 16, 17తేదీల్లో నిర్వహించడం జరుగుతుందని పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ కమిటీ సమావేశం పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ అధ్యక్షతన ఆర్అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించారు.

జోడో యాత్ర స్థల పరిశీలన

వర్ధన్నపేట : వర్ధన్నపేటలో నేడు(గురువారం) నిర్వహించే రేవంత్‌రెడ్డి జోడో యాత్ర భోజన ఏర్పాట్లకు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, నమిండ్ల శ్రీనివాస్ ఉప్పరల్లి క్రాస్ రోడ్డు వద్ద స్థల పరిశీలన చేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



వర్ధన్నపేట : సీఎం కేసీఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ జాగృతి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కేసీఆర్ కప్ వాలీబాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా మహిళా వాలీబాల్ జట్టులో మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సీనపెల్లి అశ్విని, తమ్మడబోయిన అనూష, కీర్తి హారిక ఎంపికైనట్లు వాలీబాల్ జిల్లా కోశాధికారి బాలికల కోచ్ జలగం రఘువీర్, ఉప్పరపల్లి పీఈటీ వీరస్వామి తెలిపారు. రాష్ట్ర స్థాయి కేసీఆర్ కప్‌కు ఎంపికైన క్రీడాకారిణిలను సర్పంచ్ ఆరెల్లి ప్రవంతి అంజన్‌రావు, ఎంపీటీసీ రజిత శంకర్, ఉప సర్పంచ్ గోక సతీష్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రమేష్‌బాబు, కార్యదర్శి హన్మంతరెడ్డి, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి అభినందించారు.

‘రాబోయేది బీజేపీ ప్రభుత్వమే’



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

సంగెం : తెలంగాణ సాధించుకున్న తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలను విస్మరించి అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని, ప్రజలు ఆశీర్వదిస్తే వచ్చేది బీజేపీ ప్రభుత్వమేనని రాష్ట్ర కార్యవర్గ నాయకుడు డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజాగోస–బీజేపీ భరోసా శక్తి కేంద్రాల కార్నర్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కుమారస్వామి, వెంకటేశ్వర్‌రావు, చేరాలు, శ్రీనివాస్, ప్రకాష్, మల్లేశం పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి

నెక్కొండ : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు, మాజీ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని దీక్షకుంట గ్రామంలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. కేంద్ర పథకాలతోనే రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సింగారపు సురేష్, సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు కక్కెర్ల అనిల్‌కుమార్, మాజీ సర్పంచ్ పులి ప్రసాద్, నాయకులు అంబాల రాంగోపాల్, కాసు మల్లికార్జున్‌రెడ్డి, గోపగాని శ్రీకాంత్, సూత్రపు శ్రీనివాస్, రాయల చక్రపాణి, గూడెల్లి అనిల్, ప్రవీణ్, రాజు, మైబ్‌నాయక్ పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నర్సంపేట రూరల్: తపాలా శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ అన్నారు. పట్టణంలోని పోస్టాఫీస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవాలయం, కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, నలగొండ జిల్లా ఎల్లారెడ్డిగూడెంలోని శ్రీపార్వతి జడల రామలింగేశ్వరస్వామి ఆలయం, కాళేశ్వరంలోని ముక్తేశ్వరస్వామి దేవాలయం, సంగారెడ్డిలోని శ్రీకేతకి సంగమేశ్వరస్వామి దేవస్థానాల్లో భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి ప్రసాదాలను భక్తులు తమ ఇంటి వద్దే పొందే విధంగా పోస్టల్ శాఖ సేవలను తీసుకొచ్చిందన్నారు. ఈ సేవల కోసం రూ.240 చెల్లించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 17 వరకు మాత్రమే సేవలు అందుబాటులో ఉంటాయని, కావాల్సిన వారు నర్సంపేట పోస్టాఫీస్‌కు వచ్చిన బుకింగ్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముగ్దంపురం గ్రామానికి చెందిన ముత్యం నవీన్ ఇటీవల మృతిచెందాడు. కాగా బుధవారం తోటి మిత్రులు నవీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.13,500ల నగదును బాధిత కుటుంబానికి అందించారు.

విద్యార్థికి అభినందనలు

వరంగల్ (పర్వతగిరి) : మండలంలోని కల్లెడ ఆర్‌డీఎఫ్ జూనియర్ కళాశాలలో చదువుతున్న గట్ల మనుశ్రీ కరాటేలో గోల్డ్ మెడల్ సాధించడంతో బుధవారం అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

నర్సంపేట రూరల్ : భూ ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని, గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు పట్టాలు అందించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం నర్సంపేట ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయంలో అందించారు.

బండా ప్రకాష్‌ను కలిసిన ముదిరాజ్‌లు

రాయపర్తి : శాసన మండలి వైస్ చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్సీ బండా ప్రకాష్‌ను బుధవారం కలిసి శాలువాతో సత్కరించినట్లు మండల ముదిరాజ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరోపణలు మానుకోవాలి

గీసుకొండ : బీఆర్ఎస్ నాయకుడు గోపాల నవీన్ రాజుపై ఓ మహిళ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నాయిని భరత్ అన్నారు. బుధవారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలో అంజనీ దేవి చేసిన ఆరోపణలను బీసీ సంక్షేమ సంఘం నాయకులు, గ్రామస్తులు, మహిళలు ఖండించారు.

ప్రజాగోస యాత్ర సరికాదు

నర్సంపేట రూరల్ : రైతులను కార్మికులను మోసం చేసి ప్రజాగోస యాత్ర చేయడం సరికాదని దాడువాయి సంఘం రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పెరుమాండ్ల రవి అన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

వర్ధన్నపేట : వర్ధన్నపేటలోని డీసీ తండాకు చెందిన భూక్యా నరసింహ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో బాధితుడికి ఎమ్మెల్యే అరూరి రమేష్ బుధవారం అందజేశారు.

రికార్డుల పరిశీలన

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయాన్ని జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ తోట శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. సంఘ సభ్యుడు గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో రికార్డులు పరిశీలించి విచారణ చేపట్టారు.

కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లిలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, స్త్రీనిధి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి బుధవారం ప్రారంభించారు.

హింసాత్మక దాడులు అరికట్టాలి

నర్సంపేట రూరల్ : ప్రజాస్వామ్యయుతంగా త్రిపుర ఎన్నికలు నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి అన్నారు. త్రిపురలో బీజేపీ హింసాత్మక దాడులను అరికట్టాలని కోరుతూ నర్సంపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ రోడ్డు కూడలి వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

పోరాడి హక్కులు సాధించుకోవాలి

నర్సంపేట రూరల్ : గొల్ల కురుమలు సంఘటితంగా పోరాటం చేసి తమ హక్కులను సాధించుకోవాలని గొల్ల కురుమ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆబోతు రాజు యాదవ్ అన్నారు. నర్సంపేటలోని వల్లబ్‌నగర్‌లో నిర్వహించి యాదవసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి

దుగ్గొండి/ పర్వతగిరి : మండలంలోని పొనకల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదే శిబిరాన్ని కంటి వెలుగు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ మధుసూదన్ తనిఖీ చేశారు. పర్వతగిరి మండలంలోని అద్దబాటతండాలో కంటి వెలుగు శిబిరాన్ని బుధవారం ఎంపీపీ కమల పంతులు, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎండి.సర్వర్ ప్రారంభించారు.

ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్

ఎమ్మెల్యే అరూరి రమేష్



పర్వతగిరి: సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమేష్

వరంగల్ (పర్వతగిరి) : సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారా గిరిజనులకు మాత్రమే ఆరాధ్యదైవం కాదని, అందరికి ఆరాధ్యుడేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. సేవాలాల్ చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మేరకు సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం నియోజకవర్గ స్థాయి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు దశదిశలు చూపి, హైందవ ధర్మం గొప్పతనం, విశిష్టతలను తెలియజేయడానికే సేవాలాల్ మహారాజ్ జన్మించారని చరిత్రలు చెబుతున్నాయన్నారు. బంజారా జాతి ఔనత్యాన్ని ప్రపంచానికి చాటేలా పునాదులు వేశారన్నారు. దీంతో సేవాలాల్ ఇతర కులాలకు కూడా ఆదర్శమూర్తిగా నిలిచాడన్నారు. గిరిజనుల అభివృద్ధికి, సంస్కృతీ, సాంప్రదాయాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారన్నారు. రూ.24కోట్లతో ప్రతిష్టాత్మకంగా గిరిజనుల ఆత్మగౌరవం ప్రతిబింబించేలా బంజారా భవనం నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బంజారా కులపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

పర్వతగిరి మండల కేంద్రంలో సేవాలాల్ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావులు సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

సేవాలాల్ జయంతి వేడుకలు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముత్యాలమ్మ తండా గ్రామంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సైదా రాజేందర్, ఉపసర్పంచ్ రవి, గ్రామస్తులు లక్ష్మం, నరేష్, శ్రీను, రాజేష్, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెన్నారావుపేట: పూజలు చేస్తున్న నాయకులు




నర్సంపేట రూరల్: ముత్యాలమ్మతండాలో..

చెన్నారావుపేట : మండలంలోని సూర్యపేట తండా, అమృ తండాలో బుధవారం సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగ్ భండారో పూజలు చేశారు. గోర్ సిక్వాడి కో ఆర్డినేటర్ బోడ కిషన్ నాయక్, జిల్లా కో ఆర్డినేటర్ ధరావత్ కిషన్‌నాయక్, తండా వాసులు వాగ్య నాయక్, బాలాజీ, ధన్సింగ్, ప్రవీణ్ ఉన్నారు.

సేవాలాల్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

సంగెం : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ స్ఫూర్తితో బంజారాలు ముందుకు సాగాలని సర్పంచ్ బానోత్ విద్యారాణి, ఎంపీటీసీ బానోత్ పద్మ అన్నారు. బుధవారం మండలంలోని బీకోజీనాయక్ తండాలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దార్శనికుడైన సేవాలాల్ బంజారాల జీవన శైలిని మార్చేందుకు దేశవ్యాప్తంగా తిరిగి వేర్వేరుగా కాకుండా ఒకే చోట నివసించాలని చెప్పారన్నారు. గిరిజన యువత సేవాలాల్ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వంశీరాజ్, కిషన్, బిక్కు, రాజు, బాలు, వీరన్న ఓంకార్, హనుము, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఐలయ్య విన్యాసాలు అదుర్స్



నీటిలో యోగాసనం వేస్తున్న ఐలయ్య(ఫైల్)

చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురం గ్రామానికి చెందిన యోగా ఆచార్యుడు ములుక ఐలయ్య నీటిలో యోగాసనాలు అద్భుతంగా ఉన్నాయని ఆంధ్రప్రదేశ్‌లోని ఆళ్లగడ్డకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు బలిగాల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు బుధవారం ఐలయ్యను కలిసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో కూడా విన్యాసాలు చేయించి యోగా ప్రాముఖ్యతను వివరించడానికి ఆహ్వానించినట్లు తెలిపారు. యోగా ఆచార్యులు ఐలయ్య మాట్లాడుతూ.. తను నీటిపై తేలియాడుతూ చేసిన యోగాసనాలు పలు ప్రాంతాలకు వెళ్లడం, వారు అభినందించడం సంతోషంగా ఉందన్నారు.

వరిలో సస్యరక్షణతో దిగుబడులు

నర్సంపేట రూరల్: రబీ సీజన్‌లో వరి సాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ అన్నారు. లక్నెపల్లి శివారులోని వరి పంటను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో కాండం తొలుచు పురుగు సోకుతుందని, నివారణకు 2 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ లేదా 4 కిలోల క్లోరాంట్రానిలిప్రోల్ 0.4జీ గుళికలను ఎకరా పొలంలో వేయాలని సూచించారు. అలాగే అగ్గి తెగులు సోకేందుకు వాతావరణం అనుకూలంగా ఉందని, నివారణకు 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా 1.5 మిల్లీ లీటరు ఐసోప్రోథయోలిన్ లేదా 2.5 మిల్లీ లీటర్ల కాసుగామైసిన్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జీ లేదా 6 కిలోల ఫిప్రోనిల్ 0.3జీ లేదా 4 కిలోల ఫిప్రోనిల్ 0.6జీ గుళికలను ఎకరానికి వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ నవీన్, ఎస్ఎఫ్ఎస్ఎం కన్సల్టెంట్ పి.సారంగం, వీఆర్ఏ భిక్షపతి పాల్గొన్నారు.